# 'స్వచ్ఛ కలెక్టరేట్' కోసం చేయి కలుపుదాం!

## మొక్కలు నాటిన కలెక్టర్, జేసీ



కలెక్టరేట్‌లో శ్రమదానం చేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ నివాస్ తదితరులు

**వన్‌టౌన్, న్యూస్‌టుడే:** 'స్వచ్ఛ కలెక్టరేట్- స్వచ్ఛ విశాఖ' కార్యక్రమాన్ని శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తోన్న వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ నివాస్, డీఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ పరిపాలనాధికారి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్, జేసీలు స్వయంగా పిచ్చిమొక్కలను తొలగించారు. చెత్తాచెదారాన్ని ఏరివేశారు. వాటిని మూటలు కట్టి జీవీఎంసీ వాహనాల్లో తరలించారు. అనంతరం పార్కు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ నాలుగో శనివారం స్వచ్ఛవిశాఖ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. నగరంతో పాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను పెద్దఎత్తున చేపడుతున్నామన్నారు. కలెక్టరేట్‌లో ఉన్న వివిధ సెక్షన్ల ఉద్యోగులు ఒక్కో శనివారం ఒక్కో విభాగం ఉద్యోగులు స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.